ప్రజాశక్తి
సోమవారం 17 నవంబరు, 2025
5
శ్రీకాకుళం

30 వరకు కుష్టు నిర్మూలన సర్వే

శ్రీకాకుళం: కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా అదనపు డిఎంహెచ్ఒ తాడెల శ్రీకాంత్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30 వరకు కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2234 బృందాలను సర్వే కోసం నియమించినట్టు పేర్కొన్నారు. అందు ఒక ఆశా కార్యకర్త, ఒక మగ వాలంటీర్ బృందంగా ఏర్పడి రోజు తమ గ్రామ పరిధిలోని 20 గహాలను సందర్శిస్తారని అన్నారు. శారీరక పరీక్షలను నిర్వహించి స్పర్శ లేని మచ్చలున్న వ్యక్తులను గుర్తించాలని అన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు కను రెప్పలు, కను బొమ్మలుపై వెంట్రుకలు రాలిపోవడం, కను రెప్పలు మూతపడకపోవడం, కాలు చేతుల్లో వాపులు, తిమ్మిర్లు, అరచేతులు, పాదాల్లో బొబ్బలు, పుండ్లు రావడం తదితర లక్షణాలు కుష్టు వ్యాధి సోకిన వారిలో ఉంటాయని తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయరా..?

- రైతుల రుణాలను మాఫీ చేయాలి
- పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి
- ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ
- ఘనంగా రైతు సంఘం జిల్లా మహాసభ

మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - టెక్కలి, రూరల్

వ్యవసాయాధారిత శ్రీకాకుళం జిల్లాలో రైతాంగానికి సాగునీరందించేందుకు పెండింగ్ ప్రాజెక్టులను ఎప్పుడు పూర్తి చేస్తారని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎపి రైతుసంఘం 15వ జిల్లా మహాసభ ఆదివారం ఉత్సాహంగా సాగింది. టెక్కలి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి అన్నపూర్ణ కళ్యాణ మండపంలోని పిండి కేశవరావు సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రతినిధులతో ప్రాంగణం కళకళలాడింది. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు నివేదికను ప్రవేశ పెట్టారు. ప్రతినిధులంతా మండలాల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి సూర్యనారాయణ మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు రూ.600 కోట్లు కేటాయిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. వంశధార లిఫ్ట్‌కు రూ.150 కోట్లు, రిజర్వాయర్ పనుల కోసం రూ.150 కోట్లు, ఆఫ్‌షోర్‌కి రూ.300 కోట్లు కేటాయిస్తే శివారు భూముల వరకు నీరందించవచ్చని చెప్పారు. ప్రభుత్వ విధానాల కారణంగా వ్యవసాయం సంక్షోభంలో ఉందని, ఈ నేపథ్యంలో రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 1.60 లక్షల ఎకరాల భూములను పరిశ్రమల కోసం కేటాయించారని, వాటిని వినియోగించకపోవడం వల్ల ఇటు ఉపాధి లేక అటు వ్యవసాయం లేక వృథాగా పడి ఉన్నాయని తెలిపారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన సమ్మిట్‌లో మరో పది లక్షల ఎకరాల భూమిని పరిశ్రమలకు ఇవ్వడానికి భూబ్యాంకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం రైతులను రోడ్డున పడేయడమేనన్నారు. రైతాంగానికి మేలు చేయకపోగా బలవంతపు భూసేకరణతో వారి భూములను ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. పలు ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటు అన్నారు. ధాన్యం తేమ శాతాన్ని 22కి పెంచి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలన్నారు. ఇనాం భూములు, దేవాదాయ భూములు సాగు చేస్తున్న రైతులకే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఆయా కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించాలన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతుల పోరాటానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా రైతాంగ సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన ఈనెల 26న చేపట్టే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పలు తీర్మానాలు ఆమోదం

మహాసభల సందర్భంగా పలువురు సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని తీర్మానించారు. జీడి, కొబ్బరి ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వీటితోపాటు పలు అంశాలకు సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

అమరులకు నివాళ్లు

తొలుత రైతు సంఘం పతాకాన్ని తోణంగి నందోడు ఆవిష్కరించారు. అనంతరం రైతాంగ ఉద్యమాల్లో పోరాడిన, వెన్నుదన్నుగా నిలిచిన కీర్తిశేషులు సీతారాం ఏచూరి, పినకాన కృష్ణమూర్తి, బమ్మిడి శ్రీరాములు, కవిటి బాలరాజు, వి.జి.కె మూర్తి, చింతకాయల బాబూరావు, రామారావు చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు హేమసూదన్, రాంబాబు, టి.వైకుంఠరావు తదితరులు ఆలపించిన అభ్యుదయ గీతాలు, డప్పు నృత్యాలు అందరినీ ఉత్తేజపరిచాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పొందూరు చంద్రరావు, కార్యదర్శిగా పోలాకి ప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా కె.మోహనరావు, బి.వాసుదేవరావు, సహాయ కార్యదర్శులుగా టి.అజయ్ కుమార్, భాస్కరరావు, కొండయ్యతో పాటు 20 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, బి.వాసుదేవరావు, కె.పుణ్యవతి, టి.లక్ష్మి, కె.కొండయ్య, ఎస్.భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాదరావు, ఎన్.షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రైతుసంఘం నాయకులు

మృతికి కారణమైన నీటికుంట

మృత్యు 'కుంట'

సుధీర్, అభినాష్ మృతదేహాలు (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

- నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- పందిగుంటలో విషాదఛాయలు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

పంట కోసం తవ్విన కుంట ఇద్దరు చిన్నారుల పాలిట మృత్యు కూపంగా మారింది. సరదాగా స్నానానికి దిగిన చిన్నారులు బురదలో కూరుకుపోయి బయటకు రాలేక నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన సంతబొమ్మాళి మండలంలోని పందిగుంట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన పిల్లల సుధీర్ (9), ముద్ద అభినాష్ (9) మృతి చెందడంతో గ్రామం విషాదంలో మునిగిపోయింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని పేడల వెంకటరమణకు చెందిన పొలంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఇటీవల నీటి కుంట తవ్వారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఐదుగురు చిన్నారులు పొలం వద్దకు వెళ్లి సరదాగా ఆడుకున్నారు. అందులో ముగ్గురు అమ్మాయిలు పక్క పొలంలో ఉన్న గోరింటాకు ఏరుతుండగా సుధీర్, అభినాష్ నీటి కుంటలో స్నానానికి దిగారు. పలుమార్లు పైకి వచ్చి మళ్లీ కుంటలో దూకారు. అలా దూకిన క్రమంలో కాళ్లు బురదలో కూరుకుపోయి మునిగిపోయారు. ఎప్పటికీ బయటకు రాకపోవడంతో వారితో పాటు వచ్చిన తోటి పిల్లలు గ్రామంలోకి పరుగు తీసి సమాచారం అందించారు. వెంటనే స్థానికులు కుంటలో గాలింపు చేపట్టగా ఇద్దరు పిల్లల మృతదేహాలు లభించాయి. మృతులు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. సుధీర్ తండ్రి రాము, పుష్ప... అభినాష్ తల్లిదండ్రులు పాపారావు, అనురాధ నెల్లూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలు వారి నాన్నమ్మ, తాతయ్యల వద్ద గ్రామంలో ఉంటూ చదువుకుంటున్నారు. సుధీర్ తల్లి పుష్ప, అభినాష్ తండ్రి పాపారావు ప్రస్తుతం స్వగ్రామంలో ఉన్నారు. తిరిగి నెల్లూరుకు బయలుదేరుదామనుకున్న లోపే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రెండు కుటుంబాల్లో ఇద్దరేసి మగ పిల్లలు ఉండగా, అందులో ఇద్దరూ చిన్న కుమారులు మృతి చెందడం అందరినీ కలచివేసింది. కుమారులను పట్టుకుని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెలు బాదుకుని విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. సుధీర్ తల్లిదండ్రులు రాము, పుష్ప, అభినాష్ తల్లిదండ్రులు పాపారావు, అనురాధ ఉన్నారు. సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు.

సాగులో సాంకేతికతతో సత్ఫలితాలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వ్యవసాయంలో సాంకేతికతతో సత్ఫలితాలు వస్తాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సాంకేతికతపై రైతుల్లో అవగాహన పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల ఉద్యోగోన్నతులు పొందిన వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నివేళలా అన్నదాతలకు అందుబాటులో ఉంటూ దిగుబడులు పెంచి వ్యవసాయం లాభసాటిగా మార్చాలని సూచించారు. రైతులకు పూర్తిస్థాయిలో సాంకేతిక సలహాలు, అవగాహనా కార్యక్రమాలు చేపడతామని ఉద్యోగులు మంత్రితో చెప్పారు. ఎనిమిదేళ్లుగా ఎటువంటి ఉద్యోగోన్నతులకు నోచుకోని 22 మందికి డిడిఎల నుంచి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారులుగా మంత్రి చొరవతో ఉద్యోగోన్నతులు లభించాయని సంతోషం వ్యక్తం చేశారు.

సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. అధికారులు సమస్యను పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రజలు వినతులు సమర్పిస్తారని, అందుకు తగ్గట్టుగానే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు పదే పదే అర్జీలు సమర్పించే అవసరం లేకుండా ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. విజ్ఞప్తులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

సంతబొమ్మాళి : తరలివచ్చిన యాత్రికులు

తీరాల్లో కేరింతలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి, పోలాకి

మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి సముద్ర తీరాలు ఆదివారం పిక్నిక్ సందడితో కిటకిటలాడాయి. సెలవుదినం కావడంతో జిల్లా నలుమూలల నుంచి కుటుంబాలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తీర ప్రాంతంలో కేరింతలతో సందడి చేశారు. తోటల్లో సేదతీరుతూ, సముద్ర స్నానాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. భావనపాడు సముద్రతీరంలో డిజె పాటలకు యువత నృత్యం చేస్తూ ఉత్సాహ వాతావరణాన్ని నెలకొల్పారు. అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో భావనపాడు తీరం నిండిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నౌపడ పోలీసులు, భావనపాడు మెరైన్ పోలీసులు సంయుక్తంగా పహారా కాసి ప్రజలకు ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ అవగాహన కల్పించారు.

పోలాకి మండలంలో కార్తీక మాసం నాలుగో ఆదివారం పురస్కరించుకుని రాజారాంపురం సముద్ర తీరం పిక్నిక్ సందడి కోలాహలంగా మారింది. రాజారాంపురం సముద్ర తీరం వెంబడి జీడి తోటలు ఉండటం వల్ల పిక్నిక్‌కు అనుకూలంగా ఉంది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి యువకులు, పిల్లలు, వృద్ధులు, కుటుంబ సభ్యులతో సహా వచ్చి వనభోజనాలు చేశారు. అనంతరం సముద్ర తీరంలో స్నానాలు ఆచరించారు. అయితే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఎస్ఐ రంజిత్ ఆధ్వర్యాన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పోలాకి : బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సన్ డే... పుస్తక పండగే



ప్రజాశక్తి - అరసవల్లి

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవానికి పుస్తక అభిమానులు పోటెత్తారు. ఆరో రోజు ఆదివారం పాఠకులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. చిన్నారుల కథల పుస్తకాలు మొదలుకొని విద్యార్థులకు అవసరమైన పలు పుస్తకాలు, వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక, అభ్యుదయ సాహిత్య పుస్తకాలు, పలువురు ప్రముఖుల గాథలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వందలాది ప్రచురణ సంస్థల పుస్తకాలకు సిక్కోలు పుస్తక మహోత్సవం వేదికగా మారింది. దీంతో చిన్నారులు, విద్యార్థులు, యువత ఇలా వయోభేదం లేకుండా అందరూ పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలను ఆసక్తిగా పరిశీలించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.రజని పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి, పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల్లో నైతిక విలువలు పెరుగుతాయన్నారు.

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న బిఆర్‌ఎయు విసి రజని

మహిళలు రచనలు చేయాలి

కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై 'కళింగాంధ్ర సాహిత్యంలో మహిళా, ఆదివాసీ, దళిత ఆవరణాలు' అంశంపై ఆదివారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూనివర్శిటీ విసి రజని మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా రచనలు చేస్తే మహిళా సమస్యలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. పురుషులతో సమానంగా మహిళా రచయితలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రచయిత్రి కత్తి పద్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో మంచి సాహిత్య రచయితలు ఉన్నారని, రచయిత్రిలే

పుస్తక అభిమానులతో కిటకిట

కరువయ్యారన్నారు. రచయిత మల్లిపురం జగదీష్ మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలపై కళింగాంధ్ర రచయతలు రచనలు చేసి చైతన్యం తెచ్చారని తెలిపారు. కలమట దాసుబాబు మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలు, దళిత మహిళలపై రచనలు చేసిన వారు లేరన్నారు. కారశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీ సాహిత్యం అడవితల్లి వేదన నుంచి పుట్టిందని తెలిపారు. రచయిత నాగరాజు మాట్లాడుతూ గిరిజన మహిళల గురించి రచనలు రావడం లేదన్నారు. అనంతరం రచయితలు కంచరాన భుజంగరావు, ఎల్.ఎన్ కొల్లి రచించిన 'పెయిన్స్ అండ్ గ్రెయిన్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మల్లిపురం జగదీష్ రచించిన 'అడవి పూలదారిలో' పుస్తకాన్ని రచయిత పక్కి రవీంద్రనాథ్ పరిచయం చేశారు. అనంతరం కవితా పఠనం నిర్వహించారు. సిక్కోలు జానపద, సాహిత్య కళావేదిక ఆధ్వర్యాన జానపద గేయాలను ఆలపించారు. రచయిత కె.తిరుమలరావు 'భారత రాజ్యాంగం' పాట పాడి వినిపించారు. కె.ఎ రాములు ఆధ్వర్యంలో గజల్స్ వాద్య సంగీతం ఆకట్టుకుంది. అనంతరం జానపద గేయాలతో నృత్యాలు అలరించాయి.

నేటి కార్యక్రమాలు

నాలుగు గంటలకు సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు మాయలు, మహిమలు, మ్యాజిక్ షో. ఐదు గంటలకు సాహిత్య కార్యక్ర మాలు ఉత్కళాంధ్ర సాహిత్య, సాంస్కృతిక సంబంధాలు' చర్చాగోష్ఠి. అనంతరం ఖాకీ చొక్కా, వర్తమానం నుంచి గతం వైపు, హంస వాహిని పుస్తకావిష్కరణలు. జానపద గేయాలు, థింసా నృత్యం, తెలుగు కవుల వేషధారణ, శిశుపాలుడు ఏకపాత్రాభినయం, సమాజమా మేలుకో స్కిట్, కళాశాల విద్యార్థులతో నృత్యాలు.

పుస్తకాలను తిలకిస్తున్న పుస్తక ప్రియులు

టెలిస్కోప్‌లో వీక్షణకు లైన్‌లో ఉన్న విద్యార్థులు

అర్హులందరికీ ఇళ్లు

- పేదల ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ
- సకాలంలో బిల్లుల చెల్లింపు
- దరఖాస్తుల స్వీకరణ
- గృహ నిర్మాణశాఖ పీడీ రమాకాంతారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇళ్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెకు డైరెక్టర్ డి.రమాకాంతారావు తెలిపారు. ఇళ్లు మంజూరు చేసిన వారికి నాలుగు విడతల్లో సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎన్‌టిఆర్ హౌసింగ్, ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. గత కొన్నేళ్లుగా 67,841 ఇళ్లు మంజూరు కాగా, 47,897 నిర్మాణాలు పూర్తయ్యాయి. 19,944 నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. మంజూరైన ఇళ్లు శత శాతం పూర్తి లక్ష్యంగా నిర్ధేశించుకొని ముందుకు సాగుతున్నాం.

? అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లు ప్రారంభించాలని సూచిస్తున్నాం. ప్రణాళిక ప్రకారం లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నాం. గతంలో అమలు చేసిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక మంచి ఫలితాలు ఇచ్చింది.

? యూనిట్ ధర్ తక్కువగా ఉండటం సమస్య కాదా?

పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.80 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. యూనిట్ ధర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. భవిష్యత్‌లో పెరిగే అవకాశం ఉంటుంది. అదనంగా బ్యాంకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

? బిల్లులు సకాలంలో చెల్లింపునకు చర్యలు ఏమిటి?

ఇంటి నిర్మాణం పూర్తి చేసిన మూడు రోజులకే బిల్లు జనరేట్ అవుతుంది. పునాదులు, శ్లాబ్ లెవెల్, శ్లాబ్ నిర్మాణం పూర్తి, ఇళుల పూర్తి ఇలా... నాలుగు దశల్లో బిల్లులు చెల్లిస్తున్నాం. పునాదులకు ఉపాధి హామీలో భాగంగా కూలి చెల్లిస్తారు. సిమెంట్, ఐరన్ వంటి సైతం అందజేస్తున్నాం.

? 2004-19 మధ్య బిల్లులు చెల్లింపు ఏ దశలో ఉంది?

జిల్లాలో 2014-19 మధ్య కాలంలో 37213 ఇళ్లు నిర్మించారు. రూ.280.36 కోట్లు అంచనా విలువ రూ.230.01 కోట్లు చెల్లించాం. రూ. 50.34 కోట్లు బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణాలు పరిశీలించి అర్హులకు ఇళ్లు అందజేస్తాం.

కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలి

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వంజంగి, వంజంగిపేట, అక్కివరం, తోటాడ, దూసి గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో 'రచ్చబండ - కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు వైద్య విద్య ప్రాముఖ్యత, ప్రభుత్వ మెడికల్ కాలేజీల అవసరం, ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన విద్యా సంస్థలను కార్పొరేట్ చేతుల్లోకి ఇవ్వడం తగదన్నారు. వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించే విధంగా చూడాలన్నారు. జెడిపిటిసి బెండి గోవిందరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకుడు మన్మధరావు, కూటికుప్పల నర్సింహరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాయ గట్టు పనులు చేస్తున్న రైతులు

శ్రమదానంతో బాహుదా గాయ గట్టు పనులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం బాహుదా నదిలోని బెల్లుపడా గాయ గట్టు రైతులు శ్రమదానంతో ఆదివారం పనులు చేపట్టారు. బాహుదా నదిలో ఉన్న నీటిని గాయ గట్టు ద్వారా బెల్లుపడా రైతాంగానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టారు. ఐక్యమత్యంగా తలో కొంత డబ్బులు వేసుకుని దాదాపు రూ.50 వేలు వెచ్చించి గాయ గట్టు పనులు చేపట్టారు. ఈ గాయ గట్టు ద్వారా బెల్లుపడా రైతాంగానికి సుమారు రెండు వేల ఎకరాల పంట పొలాలకు నీరు అందుతుంది. ఇరిగేషన్ అధికారులు ఏటా సమస్యను చూస్తున్నారని, వారు ఉన్నత అధికారులకు ప్రతిపాదన పంపిస్తున్నారని, కానీ నిధులు మంజూరు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో శ్రమదానంతో బాహుదా గాయ గట్టు పనులు చేస్తామన్నారు. ఈ శ్రమదానంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు ఉండడం విశేషం.

ఎస్‌జిఎఫ్ ఉదారత

కవిటి: మండలానికి చెందిన ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ తన సేవా కార్యక్రమాల పరిధి విస్తరిస్తోంది. అందులో భాగంగా ఒంగోలు వాసికి అండగా నిలబడి తన ఉదారత చాటుకుంది. వివరాల్లోకి వెళ్తే ప్రకాశం జిల్లా ఒంగోలు నివాసి 33 ఏళ్ల వెంకటేశ్వర్లు యాక్యూట్ నెక్రోటైజింగ్ ప్యాంక్రియాటైటిస్‌తో గత నాలుగు నెలలుగా కేరళలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 90 రోజులకుపైగా ఐసియులో ఉండి ప్రాణాలకు ప్రమాదం నుంచి బయటపడుతున్నా.. ఆయన పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఇంకా సమయం పడుతుంది. ఇప్పటివరకు ఆయన చికిత్సకు రూ.80 లక్షలకు పైగా ఖర్చయింది. ప్రస్తుతం కూడా ఐసోలేషన్ వార్డుకు రోజూ రూ.50 వేలకుపైగా వ్యయం అవుతోంది. ఈ పరిస్థితుల్లో వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా నిలుస్తూ స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్, ఎపిఆర్ జెసి 2011-13 బ్యాచ్ విద్యార్థులు కలిసి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంకటేశ్వర్లకు దాతల అండ అవసరమని, దయార్ద్ర హృదయాలు స్పందించి వెంకటేశ్వర్లను ఆదుకోవాలని కోరారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

లావేరు : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో ఆదివారం శాఖ గ్రంథాలయ అధికారి కె.సునీత ఆధ్వర్యంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో గ్రంథాలయాలను సందర్శించి మంచి విజ్ఞానాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రాజారావు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

లావేరు: నాటి గ్రంథాలయ ఉద్యమానికి వీరు చేసిన కృషి, సేవ అమోఘమని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పోలాకి: శాఖాగ్రంథాలయంలో సుబ్రహ్మణ్యం చిత్రపటానికి టిడిపి మండల అధ్యక్షులు మిరియబిల్లి వెంకట అప్పల నాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పూర్వ గ్రంథాల యాధికారికి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రమణమ్మ, లక్ష్మీనారాయణ, గ్రంథాలయ అధికారి కె.మానస, ఎంపిటిసి ప్రతినిధి తులుగు అశోక్‌కుమార్, హరికృష్ణ, చిన్నబాబు, వల్లంనాయుడు, శివకుమార్, లక్ష్మణరావు, తాత పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణ్, అయ్యంకి వెంకట రమణయ్యల చిత్రపటాలకు గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ, కె.భారతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గ్రంథాలయ ప్రాధాన్యత, చదువు అలవాటు, జ్ఞానవిస్తరణపై ఉపాధ్యాయులు స్పష్టీకరిస్తూ విద్యార్థులను పుస్తకాలంటే ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నలంద పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు హరి ధర్మారావు, స్వాతి స్వరూప, సహాయకులు హేమలత పాల్గొన్నారు.

బూర్జ : వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి సునీత

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న శ్రీఅయ్యంకి వెంకటరమణ, ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.ఇందిర, కుశేకర్ అల్వార్, శంకర్, కామేశ్వరి, రమణ, మోహన్ పాల్గొన్నారు.

టెక్కలి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రందాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణ, ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగబూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు గ్రంథాయాధికారి బి.రూపావతి పూలమాలలు వేసి నివాల్లర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాల యాధికారి తమిరి వైకుంఠరావు, అమ్మన్నమ్మ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని ఇజ్జవరం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వారం రోజులుగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ, హిందీలో మాట్లాడేవాడని స్థానికులు తెలిపారు. చలికాలం వల్ల గానీ, సర్పదంశం కారణం గానీ మృతి చెంది ఉండవచ్చని అనుమానం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిల్లపేటరాజాం గ్రామ సమీపంలో జీడీ తోటలో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు మండలంలోని చిల్లపేటరాజాం గ్రామ సమీపంలో జీడీతోటలో పేకాట అడుతున్నారనే సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,950 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

దుర్యోధన రెడ్డి మృతదేహం

ఇచ్ఛాపురం పాత చెక్‌పోస్టు జాతీయ రహదారిపై ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు... ఒడిశా రాష్ట్రం గంజాయి జిల్లా అల్లాడిపూర్‌కు చెందిన కర్రి దుర్యోధనరెడ్డి (30), తన స్నేహితుడు చినపాన చంద్రయ్యరెడ్డిలు బైక్‌పై ఇచ్ఛాపురం వస్తున్నారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్యోధనరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, చంద్రయ్యరెడ్డి తీవ్రంగా గాయ పడ్డాడు. వెంటనే స్థానికులు 108లో ఇచ్ఛాపురం ప్రభు త్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించిన పోస్టుమార్టం నిమిత్తం ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ ముకుందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు

మణికంఠ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

కార్మికునికి నివాళి

శ్రీకాకుళం సిటీ: జై దుర్గాభవాని వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికుడు బలగ సాయి మణికంఠ ఇటీవల నాగావళి నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయంగా తోటి కార్మికులు రూ.10 వేలు నగదు అందజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, జై దుర్గాభవాని వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు కింతాడ సంతోష్, ప్రధాన కార్యదర్శి దాడి సంతోష్ కుమార్, కోశాధికారి సనపల భూషణరావు, మాజీ అధ్యక్షులు వై.అప్పారావు, కమిటీ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లావేరు ఎస్ఐ రిలీవ్

లావేరు: లావేరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఇంతవరకు పని చేస్తున్న గదుల లక్ష్మణ రావును ఎచ్చెర్ల ఎస్ఐగా బదిలీ చేస్తూ ఎస్‌పి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆదివారం సాయంత్రం లావేరు పోలీస్‌స్టేషన్ నుంచి లక్ష్మణరావు రిలీవ్ అయ్యారు. ఇక్కడ ఎస్ఐగా ఈయన ఏడాదికిపైగా పనిచేశారు. ఇక్కడకు ఎస్ఐగా ఇంకా ఎవరిని నియమించలేదు.

అడ్డుకుంటున్న టిడిపి నాయకులు

రచ్చబండ సమావేశంలో ఉద్రిక్తత

సంతబొమ్మాళి: మండలం కాపుగోదాయవలసలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా జరుగు తున్న కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన వైసిపి నాయకులు పేరాడ తిలక్ హాజరైన సమయంలో కొంతమంది టిడిపి కార్యకర్తలు సమా వేశాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వైసిపి నాయకులపై దౌర్జన్యానికి పాల్పడడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

రమేష్ కుటుంబానికి అండ

కవిటి: రమేష్ అకాల మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు సోంపేట శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది అండగా నిలిచారు. ఆదివారం గొండ్యాలపుట్టుగకు చేరుకున్న శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శి ంచారు. తమవంతుగా రూ.6 వేలు నగదు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న రమేష్ కుటుంబాన్ని దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. రమేష్ అకాల మృతి తర్వాత ఆయన కుటుంబ దయనీయ స్థితి వివరిస్తూ ప్రజాశక్తి 'మావయ్య.. నాన్నేరి' అంటూ కథనాన్ని ప్రచురించిన విషయం విధితమే.

ఎమ్మెల్యేకు సన్మానం

నరసన్నపేట: మండలంలోని బొరిగివలస రెవెన్యూ సమ స్యలు పరిష్కా రానికి కృషి చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువ కప్పి సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నరసన్నపేట టౌన్ బొరిగివలస గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న 18/1 సర్వే నంబరు గత ఏడేళ్లుగా సమస్య ఉండేదని, ఇందులో ఇళ్లు గాని, స్థలాలు గాని రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ విషయం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారని తెలిపారు.

సన్మానిస్తున్న కాలనీవాసులు

సంఘాల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు మహిళా సంఘాల సమస్యలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని రాష్ట్ర టిడిపి బిసి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి అన్నారు. కెజిబివి ప్రాంగణంలో 12వ వార్డుకు సంబంధించి ధరణి సమాఖ్య సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం ధరణి సమాఖ్య నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమైక్య నూతన అధ్యక్షునిగా జమున, ఉపాధ్యక్షులుగా జె.లక్ష్మి, కార్యదర్శిగా జి.ఈశ్వరి, సంయుక్త కార్యదర్శి రేవతి, గోపమ్మలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి శంకర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కూర్మారావు రెడ్డి, సంతోష్‌కుమార్ రవికుమార్ పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

ఇచ్ఛాపురం: టిడిపిలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పత్రీ తవిటయ్య, నందిగాం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కొమ్మన వీధిలో కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ లివూన సంతోష్‌కుమార్‌కు ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడూ ప్రతి పక్షంలో పార్టీకి ఎనలేని సేవలు అందించిన సంతోష్ కుమార్‌కు గౌరవప్రదమైన నామినేటెడ్ పదవి రావడాన్ని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కళింగ వైశ్య సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులుకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. నాయకులు కొర్రాయి ధర్మరాజు, లీలారాణి, దట్టి శ్రీను, రామారావు, ధర్మరాజు, శేఖర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వందేమాతరం వేడుకలు

శ్రీకాకుళం సిటీ: పట్టణంలోని పెద్దరెల్లి వీధిలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో జిల్లా మాజీ సైనికులు తమ నెలవారీ సర్వసభ్య సమావేశంలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను నిర్వహించారు. జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పూర్ణ చంద్రరావు కటకం మాట్లాడుతూ వందేమాతర గేయం 150 ఏళ్లు నిండిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు వేడుకలు నిర్వహించినట్టు తెలిపారు. చైర్మన్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి. ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి- కొత్తూరు

కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, వైసిపి నాయకులు చింతాడ సూర్యనారాయణ కోరారు. మండలంలోని మెట్టూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వరి కోతలు 60 శాతం పూర్తయిందని అన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఖరీఫ్ ప్రారంభంలో విత్తనాలు లేక, ఆ తరువాత ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. మొంథా తుపాను వల్ల మండలంలోని ఆరు వేల ఎకరాలకు పంట నష్టం వాటిల్లిందని, కానీ, కేవలం రెండు వేల ఎకరాలు మాత్రమే పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేయడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ జిల్లాలోని రైతులకు అన్యాయం జరగడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.తమ్మినాయుడు, విశ్రాంత డిటి గంగరాపు దేవదాసు, మండల ఎస్‌సి సెల్ మాజీ అధ్యక్షులు మురపాక శంకరరావు, ఎస్.వరహాలింగం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఒడియా నవోదయ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి- మందస

మందస ఒడియా ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి నవోదయ మోడల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు తెలిపారు. జిల్లాలోని మందస, కంచిలి, సోంపేట, కవిటి, బూర్జ మండలాల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటగా ప్రశ్నపత్రాన్ని జిల్లా కార్యదర్శి గున్న రమేష్, పూర్వ కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు ఆవిష్కరించారు. పరీక్షలో ప్రథమ స్థానం కంచిలి మండలం బద్దాయిపుట్టుగ పాఠశాలకు చెందిన పొట్టి జ్యోత్స్న కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానం కంచిలి మండలానికి చెందిన సాగరి నువాగం పాఠశాల విద్యార్థిని శ్రావణి ప్రధాన్, తృతీయ, చతుర్థ స్థానాల్లో అలెన ప్రధాన్, మధియ చిన్మయలు నిలిచారు. పరిశీలకులుగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఒడియా శ్రీకాకుళం దుర్గాప్రసాద్ చౌదరి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు పాల్గొని విజేతలకు బహుమ

బహుమతులను అందజేస్తున్న బాబూరావు

తులను ప్రదానం చేశారు. ప్రభుత్వ బడులు కాపాడడానికి యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి రాజాన పర మేశ్వరరావు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో యుటి ఎఫ్ కోశాధికారి సోమనాథ్ సిస్టూ, సహాధ్యక్షులు ప్రియాంక మహారాణా, పూర్వ అధ్యక్షులు పిన్నింటి కొండల రావు, ఎపి ఒడియా టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.సిహెచ్.మహంతి, శంకర్ మహరణా పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వృద్ధురాలిని సన్మానిస్తున్న వాలంటీర్లు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం తెలుకుంచిలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ముగింపులో 82 ఏళ్ల దేవకమ్మని వాలంటీర్లు సన్మానించారు. అనంతరం ముగ్గులు, మ్యూజికల్ చైర్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి మాట్లా డుతూ వారం రోజులు తెలుకుంచిలో పరిసరాల పరిశుభ్రత, బ్యాంకింగ్ సేవలు, సంతకం నేర్పించడం, ఓటరు నమోదుపై అవగాహ కల్పించారని అన్నారు. అలాగే మొక్కలు నాటారని తెలిపారు. సర్పంచ్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలో కేవలం చదువు నాలుగు గదులకు మాత్రమే పరిమితమని, కానీ, ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాలతో పాటుగా చదువు చెప్తారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ సంతోష్‌కుమార్, అధ్యాపకులు శివకుమార్ పాల్గొన్నారు.

కవిటి: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఎస్‌విజె డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యాన నెలవంక పంచాయతీలో వారం రోజులు పాటు నిర్వహించిన సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా దుర్గమ్మపుట్టుగలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమం చేపట్టారు. వాలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిం చారు. అనంతరం గ్రామస్తులతో కలిసి శిబిరం ముగింపు కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.భాస్కరరావు, జె.భీమారావు పాల్గొన్నారు.

మెరుగైన ఆదాయ కల్పనే లక్ష్యం

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- కవిటి

రైతులు ఉత్పత్తి చేస్తున్న కొబ్బరి, మత్స్య సంపదతో వ్యాపారం నిర్వహించి రైతులకు మెరుగైన ఆదాయ కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య, మత్స్యకార ఉత్పత్తిదారుల ఎఫ్‌పిఒల బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్ఇఒల ద్వారా ముడిసరుకు సేకరణ, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఎఫ్‌పిఒలను బలోపేతం చేయాలని సూచించారు. మార్కెటింగ్ వైపు దృష్టి పెట్టి రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రైతులు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్వయం సహాయక సంఘాలు ఎలా లబ్ధిపొందాయో, ఎఫ్‌పిఒలూ అదే విధంగా అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎఫ్‌పిఒల ద్వారా రైతులకు ఆర్థిక చేయూత అందించేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆరంగి అనిల్ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచే కొబ్బరి కాయలను సేకరించి మద్దతు ధర కల్పించేందుకు, దళారి వ్యవస్థను తగ్గించే దిశగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కొబ్బరి అనుబంధ ఉత్పత్తుల తయారీ క్షేత్ర సందర్శించి ఎఫ్‌పిఒల ద్వారా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకార ఎఫ్‌పిఒల అధ్యక్షుడు గంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యకార రైతుల నుంచి సుమారు పది టన్నుల డ్రైఫిష్ సేకరించి మార్కెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యకారులకు ఆర్థిక చేయూత కల్పించి, ఎఫ్‌పిఒలకు ఆదాయ వనరులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కొబ్బరి మత్స్యకార ఎఫ్‌పిఒల బోర్డు సభ్యులు, లైవ్లీహుడ్ డిపిఎం బి.నారాయణరావు, ఎఫ్ఇఒ ఎపిఎం ఈశ్వరరావు, ఎపిఎం గోవిందరావు, కో-ఆర్డినేటర్లు, సిసిలు పాల్గొన్నారు.

కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటమే కర్తవ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న పాల్

రాజ్యాంగ వ్యవస్థల కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడటమే మన తక్షణ కర్తవ్యమని ప్రొఫెసర్ ఎన్ఎడి పాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. నవంబర్ 26 భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా కుల నిర్మూలనా పోరాటసమితి రాష్ట్ర కమిటీ, శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో 'రాజ్యాంగ వ్యవస్థల కాషాయికరణ - మన కర్తవ్యం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యాంగ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్ఎడి పాల్ హాజరయ్యారు. సదస్సునుద్దేశించి మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన స్వేచ్ఛ, సమానత్వం మూల సూత్రాలుగా రాజ్యాంగ రచనకు శ్రీకారం జరిగిందన్నారు. పౌరులందరికీ ప్రాథమిక హక్కులు, ప్రజలు ఎన్నుకున్న చట్టసభల ద్వారా శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ తద్వారా అధికార దుర్వినియోగానికి తావివ్వని జవాబుదారీతనం లక్ష్యాలుగా మన ప్రజాస్వామ్య సౌధం నిర్మాణం జరిగిందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న సంఘపరివార్ తన రాజకీయ విభాగమైన బిజెపి ద్వారా హిందూ రాజ్యస్థాపనకు పూనుకుందన్నారు. అందులో భాగంగానే ఆధునిక మనుస్మృతిని రాజ్యాంగంగా అమలు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. భారత రాజ్యాంగ అమలుకు బదులుగా పరోక్షంగా మనుస్మృతిని రాజ్యాంగం అమలు చేస్తున్న మనువాద కాషాయ కుట్రలను తిప్పి కొట్టి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, జగన్నాథం, బైరాగి, రాకోటి రాంబాబు, రుంకు.అప్పారావు, డి.గణేష్, కె.వి.జగన్నాథరావు, కిలారి ఈశ్వరావు, కంట వేణు, పుచ్చ దుర్యోధన, దానెసు, చింతాడ కృష్ణారావు, కోత ధర్మారావు, కళ్లేపల్లి రాంగోపాల్, బడియా కామరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమ్మిట్‌లో భారీ పెట్టుబడులు

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

విశాఖపట్నంలో రెండురోజుల పాటు ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడుల సదస్సులో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన రాష్ట్ర అభివృద్ధి దిశగా సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి లోకేష్ ప్రపంచ దేశాల్లో పర్యటిస్తూ పరిశ్రమలను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నారన్నారు. రెండు రోజుల సమ్మిట్‌లో మొత్తం 613 ఒప్పందాల ద్వారా రూ.13, 25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగావకాశాలు సృష్టి కానున్నాయని వెల్లడించారు. పెట్టుబడులు ఒక్క ప్రాంతానికే కాకుండా మూడు ప్రాంతాలకు చెందేలా ప్రభుత్వం పాటిస్తున్న వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శన మన్నారు. దీంతో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

సత్యసాయి బాబా జయంతి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని వెంగళరావు కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మంది ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో భాగంగా పేద మహిళలకు 25 చీరలను మాజీ కౌన్సిలర్ బి.అజంతా కుమారి పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ పి. తాతయ్యలు, డాక్టర్ జి.మనీష, డాక్టర్ కె.హేమంత్, డాక్టర్ జి.సాయి కిరణ్, డాక్టర్ ఎ.వి. పద్మజ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి శృతి కన్వీనర్ కె.వి.కామావధానులు, యూత్ కో-ఆర్డినేటర్ బి.దామోదర్ పట్నాయక్, కె.రవీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ శశిధర్, సిబ్బంది

పొందూరు: మండలంలోని పిల్లలవలసలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు సహకారంతో శ్రీకాకుళం డాక్టర్ అన్నెపు శశిధర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 91 మందికి బిపి, షుగర్‌తో పాటు పలు రకాల వ్యాధులకు సంబంధించి డాక్టర్ అన్నెపు శశిధర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్నమనాయుడు, శశిధర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటు కష్టం.. పంట నష్టం

- పది రోజులుగా సరఫరా లేని విద్యుత్
- లోఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు, స్టార్టర్లు
- పట్టించుకోని అధికారులు
- ఎండిపోతున్న వరి పంట
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి- రణస్థలం

రైతులు ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఏదో ఒక రకంగా ఇబ్బంది పడి రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పంట పొలాలకు నాణ్యమైన కరెంటు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈ ప్రభుత్వంలో కూడా విద్యుత్ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందించినప్పటికీ సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, మరమ్మతులైన ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, అన్నదాతలు పంటల సాగుకోసం అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని తెప్పలవలస గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుమారు ఐదు ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురయ్యాయి. ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న బోర్లు గత పది రోజులుగా పనిచేయకపోవడంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రైతులు వరి, తదితర పంటలను పండిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో వరి, తదితర పంటలు ఎండిపోతున్నాయి. నిత్యం ట్రాన్స్ ఫార్మర్‌లు మరమ్మతులకు గురికావడంతో పాటు లోవోల్టేజీ సమస్య రావడంతో రైతులకు బోర్ మోటర్లు, స్టార్టర్ల రిపేర్ తిప్పలు తప్పడం లేదు. ఒకవైపు బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోయి నీళ్లు రాక ఇబ్బందులు పడుతుంటే.. లోఓల్టేజీ సమస్యతో నీళ్లందక వరి పంట గింజ పట్టే సమయంలో పూర్తిగా ఎండిపోయి ఎంతోమంది రైతులు నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లుకు విద్యుత్ సరఫరా అందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఐక్యతకు చిహ్నం.. వన సమారాధన

ప్రజాశక్తి- లావేరు

ఐక్యతకు చిహ్నం దేవంగ కార్తీక వన సమారాధనని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రం లావేరులో పాతాదుర్గమ్మ గుడి సమీపంలోని మామిడితోటలో శ్రీభ్రమరాంబ మల్లన్న దేవాంగ సమైక్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్తీక వన భోజన కార్యక్రమనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవంగ సంఘం ఆధ్వర్యంలో ఇటువంటి సామూహిక వన భోజన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే చేతులమీదగా నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీచైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, రణస్థలం మాజీ ఎంపిపి దెయ్యం గీతామృత ఆనందరావు, జనసేన నాయకుడు విశ్వక్సేన్, ఎఎంసి చైర్మన్ ఎన్.పద్మ, లావేరు, లావేటిపాళెం, గురుగుబిల్లి, బొడ్డపాడు, వెంకటాపురం, తాళ్లవలస, సుభద్రాపురం, కేశవరాయపురం, జిజివలస, అప్పాపురం, రామునిపాళెం తదితర గ్రామాలకు చెందిన సుమారు మూడు వేలమందికి పైగా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.